జంక్షన్.. టెన్షన్!

- కూడళ్లలో కానరాని ట్రాఫిక్ సిగ్నళ్లు
- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు, వాహన చోదకులు



జింక్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రమాదకర జంక్షన్



కోరమాండల్ బస్టాప్ వద్ద ప్రమాదకరంగా మారిన కూడలి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రధాన కూడళ్లు పాదచారులు, వాహన చోదకుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. పలు జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవటం, నాలుగు వైపుల వచ్చే వాహనాలకు నియంత్రణ కొరవడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఇదీ సమస్య..

జింక్ ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న జంక్షన్‌కు మూడు వైపుల మార్గం ఉంటుంది. ఇక్కడి నుండి శ్రీహరిపురం, గాజువాక, ములగాడ హౌసింగ్ కాలనీ, గణపతినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ తదితర ప్రాంతాలకు వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఇక్కడ ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇంతటి రద్దీ ఉన్న ప్రాంతం కనుక ప్రమాదాలు జరక్కుండా తప్పనిసరిగా ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. కానీ ఇంత వరకు అలాంటి దాఖలాలు లేనే లేవు. ఈ కారణంగానే ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

కోరమాండల్ వద్ద

కోరమాండల్ బస్టాప్ నుండి గాజువాక, మల్కాపురం .. ఎఫ్‌ఆర్‌యూ ఆసుపత్రి.. అలాగే వాయుపుత్ర కాలనీ, గుల్లలపాలెం వుడా కాలనీ, బర్మాకాలనీ, ఇందిరాకాలనీ.. ఇలా చాలా ప్రాంతాలకు చేరుకోవచ్చు. ఈ జంక్షన్‌లో ఉదయం.. సాయంత్రం అన్న తేడా లేకుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విపరీతమైన రద్దీ ఉండే ఈ కూడలిలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు తప్పనిసరిగా సిగ్నల్ వ్యవస్థ ఉండాలి. కానీ అధికారులు అటువంటి చర్యలు తీసుకోకపోవటంతో తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని.. వీలు కాకపోతే కనీసం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఒక కానిస్టేబుల్‌ను అయినా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆందోళనగా ఉంది



కోరమాండల్ కూడలి వద్ద నిత్యం వాహనాల రద్దీ కారణంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. ఏ వాహనదారుడు ఏటు వైపు ఎప్పుడు వస్తాడో తెలియదు. ఇక్కడ మూడు వైపుల నుండి ఒకేసారి వాహనాలు వచ్చి పోతుంటాయి. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరగడం ఖాయం. అధికారులు స్పందించి ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ గానీ.. కానిస్టేబుల్‌ను గానీ ఏర్పాటు చేయాలి.

– సర్వసిద్ధి పైడిబాబు, వాహన చోదకుడు

సిగ్నల్స్ లేక అవస్థలు



జింక్ ఆంజనేయస్వామి ఆలయం జంక్షన్ సాయంత్రం వేళలో ఎంతో బిజీగా ఉంటుంది. ఇక్కడ మూడు వైపుల నుండి వాహనాలు వస్తుంటాయి. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇక్కడ సిగ్నల్స్ లేక ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– శ్రీనివాసరాజు, వాహన చోదకుడు

క్లుప్తంగా

చురుగ్గా విస్తరణ పనులు



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద చదును చేస్తున్న భారీ యంత్రాలు

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ జంక్షన్ విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రహదారికి ఒక వైపు విస్తరించి కాంక్రీట్‌తో ఫిల్లింగ్ చేశారు. ఇపుడు బంక్ సమీపాన ఉన్న పోలీస్ అవుట్ పోస్టు తొలగించిన చోట చదును చేస్తున్నారు. ఇక్కడ చదును చేసి ఫ్రీలెఫ్టు రహదారి పనులు చేపట్టనున్నారు. ఈ పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 35 లక్షలు వెచ్చిస్తున్నారు. ఈ కూడలిని విస్తరిస్తే వాహన చోదకులకు వెసులుబాటు కలుగుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శానిటరీ జాకెట్లు, గ్లౌజుల అందజేత



పారిశుధ్య కార్మికులకు జాకెట్లు, గ్లౌజులు అందిస్తున్న బెహరా భాస్కరరావు, జెడ్సీ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శానిటరీ కార్యాలయం వద్ద బుధవారం పారిశుధ్య కార్మికులకు జాకెట్లు, గ్లౌజులను కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి జీవీఎంసీ ముందుంటుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోపి, సన్యాసిరావు, సచివాలయ కార్యదర్శులు మణికుమార్, శ్రీనివాసరావు, శివగణేష్, చైతన్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న శాస్త్రవేత్త చిదంబరం



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శాస్త్రవేత్త చిదంబరం దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ మాజీ శాస్త్ర సలహాదారు, పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. దేవస్థానం అన్నప్రసాద పథకానికి రూ.1.50 లక్షలు విరాళం ఆయన నగదు రూపంలో అందజేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

మల్కాపురం: వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతున్న బాలుడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాలుడి కుడి కాలు విరిగిపోయింది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. సింధియా సమీపంలోని నేవల్ పార్కు క్వార్టర్‌లో ఎస్.భరత్ తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. బాలుడి తల్లి ఇక్కడ నేవల్ పార్కు క్వార్టర్‌లో అధికారి ఇంట్లో పనిచేస్తోంది. భరత్ నౌసేనాభాగ్ కేంద్రీయ విద్యాలయం–2 పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా ఇదే పాఠశాలలో అన్న తేజ 8వ తరగతి చదువుతున్నాడు.అయితే బుధవారం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు ఇక్కడ నౌసేనాభాగ్ వద్ద రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో 63వ వార్డు జై ఆంధ్ర కాలనీ ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు శ్రీహరిపురం నుంచి సింధియా వైపు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ భరత్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో భరత్ కుడి కాలు విరిగిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ద్విచక్ర వాహనం నడుపుతున్న మైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయపడిన భరత్‌ను ఆస్పత్రికి తరలించారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై డీఆర్‌ఎంను కలిసిన ఆడారి



డీఆర్‌ఎం సత్పతికి వినతిపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా తదితరులు

గోపాలపట్నం: డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతిని బుధవారం వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నం జువ్వాలమ్మ కాలనీ నిర్మాణాని అనుమతులు ఇవ్వాలని, జీవీఎంసీ 91వ వార్డు పరిధిగోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రహదారి బాగు చేయాలని కోరారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను డీఆర్‌ఎంకు వివరించారు. అలాగే జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం నుంచి కొత్తపాలెం, నరవ వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. ఇక్కడి ఐదు రైల్వే కల్వర్టుల్లో రెండు కల్వర్టులను రహదారులుగా అభివృద్ధి చేయాలన్నారు. 57వ వార్డులో రైల్వే ట్రాక్ పై నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని గోడ నిర్మించడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడ అండర్ పాస్‌వే నిర్మించాలని కోరారు. ఇలా పలు సమస్యలపై ఆయన వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన డీఆర్‌ఎం ప్రత్యేక కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు, నాయకులు ఆడారి శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, మళ్ల శ్రీను,ముర్రు వాణి, గొంతిన నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకే బాక్సింగ్



బాక్సింగ్ ఫ్రెండ్లీ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: చెడు ప్రయోజనాల కోసం కాకుండా ఆత్మరక్షణకు మాత్రమే బాక్సింగ్ ఆడాలని 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ సూచించారు. వార్డులోని గుల్లలపాలెం వాకింగ్ పార్కులో బుధవారం మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్‌ను అతిథిగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ఎంచుకున్న రంగంలో రాణించాలన్నారు. బాక్సింగ్‌లో రాణించి సొంతూరికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం బాక్సింగ్ ఫ్రెండ్లీ పోటీలను సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ అలీ, ప్రసాద్, వెంకట్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత



ధ్యాన శిక్షణలో పాల్గొన్న ఔత్సాహికులు

మల్కాపురం: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో బుధవారం 60వ వార్డు జవహర్‌నగర్ సన్‌రైజ్ కిడ్స్ స్కూల్‌లో ఉచిత ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ ప్రారంభించి మాట్లాడారు. శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, ఇది మనిషిలో శాంతిని నింపుతుందన్నారు. తద్వారా ఆ వ్యక్తి పరులకు సేవ చేయాలనే ఆలోచనతో, ప్రేమగా మసులుకోవాలని తలంపుతో ఉంటాడన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఇక్కడ ఉచితంగా శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సంప్రదించాలని కోరారు. సుమారు 50 మందికి పైగా ఔత్సాహికులు పాల్గొని ధ్యానం చేసి జ్ఞాన బోధన నేర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



విష్ణుమూర్తి(ఫైల్)

గోపాలపట్నం: లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కాకానినగర్ వద్ద చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం దరి యల్లపువాని పాలేనికి చెందిన వావిలపల్లి విష్ణుమూర్తి (28), అతని స్నేహితుడు ఉప్పాడ భాగ్యరాజ్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి మాధవధార వెళ్తున్నారు. కాకానినగర్ రైల్వే బ్రిడ్జ్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న విష్ణుమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెనుక కూర్చున్న భాగ్యరాజు ఆటోలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, తండ్రి అన్న ఉన్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న దళిత సేన నేతలు

కంచరపాలెం: సీనియర్ మెడికో వేధింపులకు బలైన వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ప్రీతిని ర్యాగింగ్ చేసి చిత్రహింసలకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రావు, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం

సీతంపేట: కవులందరూ కవిత్వ తత్వాన్ని అలవర్చుకోవాలని గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులను కదిలించే ప్రేమ, జాలి, కరుణ, కళాత్మకత రంగరించి విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని సూచించారు. పలు గజల్స్ పాడి వినిపించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వాన్ని వివిధ పద్ధతుల్లో వ్యక్తీకరించవచ్చని, అందులో పద్యం, వచన కవిత, లఘు కవితా రీతులైన నానీలు, హైకూలు, రెక్కలు మొదలైన ప్రక్రియలే కాకుండా పారశీక ప్రక్రియ గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. సాహితీవేత్తలు, రచయితలు కె.వి.ఎ స్.మూర్తి, డి.వి.సూర్యారావు కవితలు వినిపించారు.

ఆనందమని 'పింఛన్'



40వ వార్డులో పెన్షన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు



62వ వార్డులో పింఛన్ సొమ్ము అందిస్తున్న సచివాలయ సిబ్బంది

సింధియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో చెప్పిన సమయానికే సంక్షేమ పథకాలు అందుతుండటంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 40, 62, 63 వార్డుల్లో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. వేకువజాము నుంచే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఒకటో తేదీనే పింఛన్ అందడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం



108 వాహనంలో చికిత్స అందిస్తున్న సిబ్బంది

మహారాణిపేట: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఆయన కుడి చేయి తెగిపడింది. 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి వయస్సు 45 ఏళ్లు ఉండ వచ్చునని 108 వాహన సిబ్బంది తెలిపారు.

సమాచారమ్

ఆయుర్వేద వైద్య శిబిరం రేపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలను సూచిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గ్రాడ్యుయేట్లను కలుస్తున్న నాయకులు



నందమూరినగర్‌లో ప్రచారం చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు



పాతకరాసాలో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 52, 92 వార్డుల్లో బుధవారం పలు పార్టీ నాయకులు ప్రచారం చేశారు. 92వ వార్డు నందమూరినగర్‌లో విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ పట్టభద్రులను కలిశారు. వైఎస్సార్‌సీపీ బలపర్చిన బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ అయిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఇతర నాయకులతో కలిసి కంపరపాలెం, జనతాకాలనీ ప్రాంతాల్లో పట్ట భద్రులను కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీ కృష్ణ, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, బండారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 52వ వార్డు పాతకరాసా ప్రాంతంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పట్ట భద్రుల ఇళ్లకు వెళ్లి తొలి ప్రాధాన్యత ఓటు సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, నాయకులు వెదుళ్ల శ్రీనివాసరావు, జిజయ్యాని మారుతి, విజయ, నారాయణమ్మ పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని పలుప్రాంతాల్లో కార్పొరేటర్ గులిగిందల లావణ్య వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాలని పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, చీపులపల్లి కిషోర్, గురుగుబిల్లి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

శునకాల గోల.. పందుల బెడద



బాలిక వెళ్తున్న రహదారిలో వీధి కుక్కల గుంపు



పైప్‌లైన్ ప్రాంతంలో సంచరిస్తున్న పందులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పందులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికమౌతోంది. వీటి నియంత్రణపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. చూసీ చూడనట్టు ఉండటంతో సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక మార్గం నుంచి గాంధీ విగ్రహం వరకు వీధి కుక్కలు రేయింబవళ్లు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. స్థానికులు, వాహన చోదకులపై దాడులకు దిగుతున్నాయి. తాజాగా బుధవారం సాయంత్రం ట్యూషన్ సెంటర్‌కు వెళ్తున్న ఓ స్థానిక బాలికపై గాంధీ విగ్రహం వద్ద సుమారు ఆరు వీధి కుక్కలు దాడికి యత్నించాయి. ఆ సమయంలో అక్కడున్న పలువురు యువకులు కుక్కలను తరిమేశారు. 58వ వార్డు చిన్న ములగాడలోని రేకుల షెడ్‌ల దగ్గరున్న తాగునీటి పైప్‌లైన్ వద్ద ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం స్నానం చేస్తుంటే.. ఆ సమయంలో పందుల గుంపు అక్కడికి వచ్చి పరిసరాలను పాడు చేశాయి. స్నానం కోసం అక్కడ పెట్టిన సబ్బును లాక్కుపోయాయి. నిత్యం ఈ ప్రాంతంలో పందులు, వీధి కుక్కల సమస్య ఉండటంతో స్థానికులు భయాందోళనల వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

వారాది నారాయణరావు సేవలు ఆదర్శం



వారాది నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: యువతకు స్ఫూర్తిదాయకంగానే గాక నేటి రాజకీయ నాయకులకు వారాది నారాయణ రావు జీవితం ఆదర్శనీయమని విశాఖ డైయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ కొనియాడారు. ఇటీవల మరణించిన 63వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వారాది నారాయణరావు సంతాప సభ బుధవారం వార్డులోని చింతల్లోవలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు కార్యకర్తలతో కలిసి ఆనంద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారాది పార్టీకి చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, స్థానిక నాయకులు పిలక రామ్మోహనరెడ్డి, సోమాదుల సురేష్, కొట్నాన రవి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ సాంబశివరావు

ఏయూ క్యాంపస్: నిరంతర అభ్యసనం, అధ్యయనంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని రిటైర్డ్ డీజీపీ ఎస్.సాంబశివరావు అన్నారు. ఏయూ అర్థశాస్త్ర విభాగ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన అంశంపై లోతైన అవగాహన కలగాలంటే ముందుగా పలుమార్లు దానిని చదవాలన్నారు. తద్వారా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారీ, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షకు సన్నాహం , చదవాల్సిన పుస్తకాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, విభాగ ఆచార్యులు జి.నాగరాజు, డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. తమిళనాడులోని మధురై నగరంలోని త్యాగరాజన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన యుక్తి 23 మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు ఎం.స్వర్ణలత, కె.వి.వైష్ణవి, కె.ఆశిష్, ఎస్.భరత్‌కుమార్ వివిధ పోటీల్లో విజయం సాధించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.